క్లుప్తంగా

గట్టుమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నడిగూడెం : ఈ ఏడాది వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని మండల కేంద్రం సమీపంలోని గట్టుమైసమ్మ ఆలయం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. నడిగూడెం, మునగాల, మోతె మండలాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీకి శవపేటిక అందజేత

నడిగూడెం: మండల పరిధిలోని చెన్నకేశ్వాపురం గ్రామానికి చెందిన సుంకర వెంకటనర్సమ్మ (55) ఇటీవల మృతి చెందారు. ఆమె జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యులు ఆదివారం గ్రామపంచాయతీకి శవపేటిక ఫ్రీజర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీ ఎర్ర లింగారెడ్డి, సహకార సంఘం చైర్మన్ గోసుల రాజేష్, వెంకటనర్సమ్మ కుటుంబ సభ్యులు వెంకటేశ్వరరావు, ప్రవీణ్‌బాబు, గ్రామ పెద్దలు పాలడుగు ప్రసాద్, సుబ్బారావు, అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ సమావేశం



సమావేశంలో యూనియన్ నాయకులు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో ఆదివారం లోకల్ ఆటో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిటీ అధ్యక్షుడిగా నాగులు మీరాను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ నియోజకవర్గ అధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్, ఆటో డ్రైవర్లు కె.గోపి, సీహెచ్ గోపి, రవి, వెంకీ, మట్టయ్య, జహంగీర్, మురళి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ తొలగింపు

కోదాడరూరల్: మండల పరిధిలోని చిమిర్యాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో నల్లబండగూడెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనగోలు కేంద్రం ఇన్‌చార్జ్‌ను తొలగించారు. నాలుగు రోజుల క్రితం అడిషనల్ కలెక్టర్ కేంద్రాన్ని పరిశీలించగా.. ట్రక్‌షీట్‌లో ధాన్యం వివరాలు నమోదు చేయకపోవడాన్ని గమనించారు. దీంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్‌ను తొలగించి మరొకరికి బాధ్యతలు అప్పగించారు.

పశువుల విషయంలో జాగ్రత్తలు పాటించాలి

హుజూర్‌నగర్‌రూరల్: పశుపోషకులు పశువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, మేత కోసం తరలించే సమయంలో రోడ్డును దాటించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం గోపాలపురం శివారులో మృతి చెందిన పాడి గేదెలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రాత్రి సమయంలో గేదెలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతుండడంతో పాటు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పశువుల యజమానులు తమ పశువులను మేతకు వదిలే క్రమంలో రేడియం స్టిక్కర్లను వాటి మెడకు కట్టడంతో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఆయన వెంట పశువుల యజమానులు, రైతులు తదితరులు ఉన్నారు.

ప్రజా పోరాటాలే లక్ష్యంగా ముందుకు సాగుదాం

నేరేడుచర్ల: ప్రజా సమస్యల పరిష్కారానికి, కార్మికుల హక్కుల కోసం పోరాటాలే లక్ష్యంగా ముందుకు సాగాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం నేరేడుచర్ల మండల పరిధిలోని బోడల్‌దిన్న గ్రామంలో ఏర్పాటు చేసిన మేడే ముగింపు సభలో ఆయన మాట్లాడారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు చట్టాలుగా చేసి కార్మికులను బానిసలుగా చేసే కుట్ర చేస్తుందని ఆరోపించారు. వీటిని తిప్పికొట్టేందుకు మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, రావుల సత్యం, సైదులు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న బీజేపీ

నేరేడుచర్ల: పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీను ఆరోపించారు. ఆదివారం నేరేడుచర్ల మండలంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ పనిదినాలను క్రమంగా తగ్గిస్తూ పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందని దుయ్యబట్టారు. ఎనిమిది సంవత్సరాల మోదీ పాలనలో ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద పేదలకు ఒక్క ఇంటి నిర్మాణాన్నీ చేపట్టలేదన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఆయన వెంట సంఘం నాయకులు ధనుంజయ, సోమయ్య, దేవయ్య, వెంకన్న, రాములు తదితరులున్నారు.

● మున్సిపాలిటీలో మురుగు

ఇది కోదాడ మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో ఉన్న బావి. దీని చుట్టూ వర్షపు నీరు చేరి బయటకు వెళ్లడానికి వీలు లేక అక్కడే నిలిచి ఉంటున్నాయి. ఈ మురుగు నీటితో దుర్గంధం వస్తోంది. దోమలు విజృంభిస్తున్నాయి. దీనికి పది అడుగుల దూరంలోనే మున్సిపాలిటీ అధికారుల కార్యాలయాలు ఉన్నాయి. ఆ పక్కనే చైర్‌పర్సన్ కార్యాలయం ఉంది. అయినా పట్టించుకునే అధికారులే కరువయ్యారు.

– కోదాడ



● పేరుకే ఇంకుడు గుంత

ఇది కోదాడ మున్సిపాలిటీ కార్యాలయంలోని ఇంకుడు గుంత. వేల రూపాయలు ఖర్చు చేసి దీనిని నిర్మించారు. అయితే ఈ గుంతలోకి ఏనాడు చుక్క నీరు పోయిన దాఖలాలు లేవు. కారణం.. ఆవరణ కన్నా ఇంకుడుగుంత ఎత్తులో ఉంది. ఇక మున్సిపాలిటీకి చెందిన చెత్తాచెదారం ఈ గుంతలోనే వేస్తున్నారు. పారిశుద్ధ్యం మెరుగుకు పని చేస్తున్నామని చెబుతున్న అధికారులు ముందుగా తమ కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

– కోదాడ



కూరగాయల సాగుపై ఆసక్తి



చిలుకూరు మండలం దూదియాతండాలో సాగులో ఉన్న కూరగాయలు

- స్వయంగా విక్రయిస్తున్న గిరిజనతండాల రైతులు
- సబ్సిడీపై విత్తనాలు, పురుగు మందులు అందించాలని వేడుకోలు

చిలుకూరు: మండలంలోని జానకీనగర్, దూదియాతండా, శీత్లాతండాల్లో గిరిజన రైతులు ఎక్కువగా ఆకుకూరలు, కూరగాయల సాగు చేస్తున్నారు. వేసవిలో వీటికి ఎక్కువ డిమాండ్ ఉండడంతో ఈ సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. ఆయా గ్రామాల్లో తమకున్న కొద్దిపాటి భూముల్లో బోర్లు, వ్యవసాయ బావుల కింద 5 కుంటలు, 10 కుంటల్లో కూరగాయలను పండిస్తూ అధిక లాభాలను పొందుతున్నారు. ప్రతి సంవత్సరం ఈ గ్రామాల్లో దాదాపుగా 50 మందికి పైగా రైతులు 20 ఎకరాల్లో ఆకుకూరలు, కూరగాయలను పండిస్తున్నారు.



దూదియాతండాలో బెండ తోట..

దళారులకు అమ్మి నష్టపోయేకంటే..

గిరిజన తండా రైతులు తాము పండించిన కూరగాయలను స్వయంగా విక్రయిస్తున్నారు. గతంలో దళారులకు అమ్మి తీవ్రంగా నష్టపోయామని, అందుకే తాము స్వయంగా అమ్మకుంటున్నామని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆకు, కూరగాయలను సాగు చేస్తున్న గిరిజన తండా రైతులు మండలంలోని పలు గ్రామాలతోపాటు, హుజూర్‌నగర్, కోదాడ పట్టణాల్లో విక్రయిస్తున్నారు. ప్రధానంగా గోంగూర, బచ్చలకూర, తోటకూర, పాలకూర, పాదినా, కొత్తిమీర వంటి ఆకుకూరలు, వంకాయలు, దొండకాయలు, బెండకాయలు, దోసకాయలు లాంటి కూరగాయలు సాగు చేస్తున్నారు. అయితే కూరగాయల సాగుకు కావాల్సిన విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందించి ప్రోత్సహిస్తే మరికొంత మంది రైతులు ఈ సాగుపై ఆసక్తి చూపుతారని చెబుతున్నారు.

కూరగాయల సాగు పర్వాలేదు



కూర, ఆకుకూరల సాగు పర్వాలేదనిపిస్తుంది. రోజు వారీ కూలీ ఉంటుంది. ఆకుకూరల విత్తనాలు చల్లిన వెంటనే మూడు రోజులకు ఒకసారి నీళ్ల తడి పెడితే వారం రోజుల్లో మొక్కలు పెరుగుతాయి. వాటికి అనుగుణంగా యూరియా వేస్తే పదిహేను రోజుల్లో ఆకుకూరలు కోతకు వస్తాయి. వ్యవసాయ శాఖ అధికారులు ఆకు, కూరగాయల సాగు చేసే రైతులకు సబ్సిడీపై విత్తనాలు, పురుగు మందులు అందించి ఆదుకోవాలి.

– గుగులోతు సైదా, దూదియాతండా, చిలుకూరు మండలం

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



గణపవరంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



నడిగూడెం మండలం వెంకట్రాంపురంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడరూరల్ : ఆలయాల అభివృద్ధికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం కోదాడ మండల పరిధిలోని గణపవరం గ్రామంలో గల శ్రీవరవర రంగనాయక స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో గల పురాతన ఆలయాలను పునఃప్రతిష్ఠించుకొని వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన పూర్ణకుంభంతో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతా కవితారాధారెడ్డి, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి, సర్పంచ్ పొట్టా శ్రీవిజయకిరణ్, ఆలయ కమిటీ చైర్మన్ కామిశెట్టి నర్సింహారావు, ముడియాల వెంకట్‌రెడ్డి, నరసింహారావు, మధు, రాంబాబు, కొండలు, జైపాల్ తదితరులున్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

అనంతగిరి: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం అనంతగిరి మండల పరిధిలోని వెంకట్రాంపురం గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. ఆయన వెంట సర్పంచ్ రాణిజాన్, పార్టీ మండల అధ్యక్షుడు గింజుపల్లి రమేష్, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, ఐతనబోయిన వెంకటేశ్వర్లు, రేవళ్ల కృష్ణ, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


కేసీఆర్ హయాంలోనే ఆలయాలకు పూర్వ వైభవం

నడిగూడెం: సీఎం కేసీఆర్ హయాంలోనే దేవాలయాలకు పూర్వవైభవం వచ్చిందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఆదివారం నడిగూడెం మండల పరిధిలోని వెంకట్రాంపురంలో నిర్వహించిన ధ్వజస్తంభ మహోత్సవం, ముత్యాలమ్మ, కనకదుర్గ, శ్రీఆంజనేయ ఆలయాలను ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని పేర్కొన్నారు.

నిరుపయోగంగా భగీరథ ట్యాంకులు

- ట్యాంకులకు సరఫరా కాని నీరు
- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న చిలుకూరు మండల వాసులు

చిలుకూరు: చిలుకూరు మండలంలో మిషన్ భగీరథ నిర్వహణ అధ్వానంగా మారింది. మండల వ్యాప్తంగా ఉన్న 29 ట్యాంకుల్లో సగానికి పైగా ఉత్సవ విగ్రహాలుగా ఉన్నాయి. జెర్రిపోతులగూడెంలో ఒక్క ట్యాంక్‌కు కూడా నీరు సరఫరా కావడం లేదు. అదేవిధంగా చిలుకూరులో రెండు ట్యాంక్‌లకు, మాధవగూడెంలో ఒక ట్యాంక్, బేతవోలు మూడు ట్యాంక్‌లకు అసలు నీళ్లు రావడం లేదు. దీంతో గ్రామాల్లో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ఎక్కడ చూసినా లీకేజీల పేరుతో గ్రామాల్లో ఇంటింటికీ నీళ్లు అందడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై మిషన్ భగీరథ ఏఈ నాగరాజును వివరణ కోరగా మండల వ్యాప్తంగా సాధ్యమైనంత వరకు మిషన్ భగీరథ ట్యాంక్‌లు వినియోగంలోకి వచ్చేలా చూస్తామని తెలిపారు. ఇంటింటికి నీళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



మాధవగూడెంలో వృథాగా ఉన్న మిషన్ భగీరథ ట్యాంక్



చిలుకూరులో..



జెర్రిపోతులగూడెంలో..

అక్రమంగా మట్టి తవ్వకాలు

- పనులు నిలిపివేయించిన తహసీల్దార్

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని లింగగిరి గ్రామ శివారులో గల వైకుంఠధామం పక్కనున్న ఏనేకర్ర గుట్టను గ్రామానికి చెందిన కొందరు వ్యాపారులు కొద్దిరోజులుగా మట్టి తవ్వకానికి పాల్పడుతున్నారు. ఆదివారం ప్రొక్లెయిన్ల ద్వారా తవ్వుతూ మట్టిని టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తుండడంతో సమాచారం అందుకున్న తహసీల్దార్ వజ్రాల జయశ్రీ తమ సిబ్బందిని పంపించి పనులు నిలిపివేయించారు. అనుమతులు లేకుండా గుట్టను తవ్వితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో ఇటీవల కస్తాల వీరయ్య మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు నరేష్, వసంత్, సత్యనారాయణ, లక్ష్మణాచారి, సుధాకర్, చంటి తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

నాగారం : మండల పరిధిలోని నర్సింహులగూడెంలో ఆదివారం విద్యుదాఘాతానికి గురై పాడిగేదె మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు నోముల వెంకటయ్య రోజు వారిగానే తన గేదెలను వ్యవసాయక్షేత్రంలోకి మేతకు తోలుకెళ్తున్నాడు. గేదె మేత మేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ గేదెకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ గేదె విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరాడు.

ఉత్తమ విద్యాబోధన ఫలితమే మంచిస్థానం

- రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట : ఆనాడు నేతాజీ విద్యా మందిర్‌ను స్థాపించి నిరుపేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో ఉత్తమ విద్యా బోధన అందించిన ఫలితమే నేడు తనను ఈ స్థాయికి చేర్చిందని నేతాజీ విద్యా మందిర్ వ్యవస్థాపకుడు, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. ఆదివారం నేతాజీ విద్యా మందిర్ పాఠశాలకు చెందిన 1995–96 పదో తరగతి పూర్వ విద్యార్థులు తాళ్లగడ్డలో, 1998–99 పూర్వ విద్యార్థులు ట్రిపుల్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 1998–99 పూర్వ విద్యార్థులు సంద్రపాటి రవి, పఠాని రవీందర్, ఊట్కూరి శ్రీనివాస్, రాపర్తి సతీష్, అనంతుల కిరణ్, పి.మోహన్, బైరు నాగేందర్, ఇరుగు కృష్ణ, అప్పల కిరణ్, సంధ్య, మాధవి, శ్వేత, కవిత, లక్ష్మి పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులతో బడుగుల లింగయ్యయాదవ్

ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలి

మద్దిరాల : ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గోరెంట్ల గ్రామంలో జరిగిన శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్, బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కల్లెట్లపల్లి శోభన్‌బాబు, వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, దుగ్యాల రవీందర్‌రావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్దన్ రెడ్డి, నాయకులు కన్న వీరన్నగౌడ్, గుడ్ల వెంకన్న, సూరినేని నర్సింహారావు, ఎంపీటీసీ శిరంశెట్టి వెంకన్న, సర్పంచ్ దామెర్ల వెంకన్న, అమృతరెడ్డి, బద్దం సంజీవరెడ్డి, వడ్డాణం మధుసూదన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గోరెంట్లలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

భానుపురి : అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో జరిగే నిరుద్యోగ బహిరంగ సభకు ఐదువేల మందితో సూర్యాపేట నుంచి బయలు దేరుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు షఫీఉల్లా, స్వామినాయుడు, చొక్కయ్యగౌడ్, సైదిరెడ్డి, వల్దాసు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భరోసా సభకు తరలిన నాయకులు

మేళ్లచెరువు: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ భరోసా సభకు మేళ్లచెరువు మండలంలోని బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారిలో మంద రవి, నాగరాజు, రాజు, నాగులబీ, వెంకటేశ్వర్లు, చందు, వీరబాబు తదితరులు ఉన్నారు.

నేరేడుచర్ల: బీఎస్పీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ భరోసా సభకు ఆదివారం నేరేడుచర్ల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. వారిలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్, నర్సింహరావు, సుబ్బగౌడ్, ఉపేందర్, గోవింద్, రామస్వామి, సురేష్‌బాబు, మట్టపల్లి, వీరాంజి, ప్రేమ్‌కుమార్, సతీష్‌రెడ్డి, గోపి, పవన్, విజయ్ తదితరులున్నారు.

హ్యాండ్ రైటింగ్‌పై శిక్షణ

సూర్యాపేటటౌన్ : బాలభవన్ వేసవి శిక్షణ క్యాంప్‌కు హాజరైన విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్ ఎక్స్‌పర్ట్ పల్లె మణిబాబు ఆదివారం హ్యాండ్ రైటింగ్ స్కిల్స్ ఇంప్రూవ్ చేసుకునే మెళకువలు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్న వయసు నుంచే చేతిరాత ప్రాముఖ్యతను గుర్తించి శ్రద్ధ పెడితే పైచదువుల్లో ఇబ్బందులు ఉండవని, పిల్లల్లో సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పెరుగుతుందన్నారు.

ఘనంగా బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



చిలుకూరులో బొడ్రాయికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

చిలుకూరు: కొత్త చిలుకూరులో ఆదివారం బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ దంపతులు విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన వార్షికోత్సవం

మఠంపల్లి: మండలంలోని అల్లీపురంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బోనాలు నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోళ్లపూడి వెంకయ్య, ఉపసర్పంచ్ రాజీవ్, మాజీసర్పంచ్ బోగాల పిచ్చిరెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మోతె: మండల పరిధిలోని తుమ్మగూడెం గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ దేవాలయంలో ఆదివారం ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ, అదేవిధంగా బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం సంస్కృతి సంప్రదాయాలకు నిలయమని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సిరెడ్డి, ఉపసర్పంచ్, టీఆర్‌ఎస్ నాయకులు శీలం సైదులు, ఆరె లింగారెడ్డి, వెంకటేశ్వరరావు, మద్ది మధుసూదన్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



అల్లీపురంలో బొడ్రాయి వద్ద పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మునగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002– 2003 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానికంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులను ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు దయానంద్, జానిమియా, నిరంజన్‌రెడ్డి, స్వరాజ్యలక్ష్మి, సత్యనారాయణ, రామచంద్రయ్య, జానీ అహ్మద్, అనంతరాములు, మోహన్‌రావు, మాధవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.